LV Prasad Eye Institute

So that all may see

## ఎల్ వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థలో నాయకత్వ మార్పు

## డా గుళ్ళపల్లి ఎస్ రావు ఉత్తరాధికారిగా డా ప్రశాంత్ గర్గ్

ఎగ్జిక్యూటివ్ అధ్యక్షులు డా గుళ్ళపల్లి ఎన్ రావుకు ఉత్తరాధికారిగా డా ప్రశాంత్ గర్గ్ ఎంపికను ఎల్ వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ప్రకటిస్తున్నది. డా గర్గ్ తన నూతన పదవీ బాధ్యతలను 2021 అక్టోబర్ 1వ తేదీన స్వీకరించారు.

అవసరంలో ఉన్న వారందరికీ అత్యుత్తమ మరియు నిష్పక్షపాతమైన సమగ్ర నేత్ర సంరక్షణా సేవలను అందించాలనే ఉద్దేశ్యంతో డా గుళ్ళపల్లి ఎన్ రావు 1987లో ఎల్ వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థను ఒక ప్రజా స్ఫూర్తిగల, ప్రభుత్వేతర, లాభాపేక్షలేని నేత్ర ఆరోగ్య సంస్థగా స్థాపించారు. గత మూడు దశాబ్దాలుగా డా రావు విశిష్ట నేతృత్వంలో ఎల్విపిఇఐ 32.11 మిలియన్ల (3 కోట్ల 21 లక్షల)కు పైగా ప్రజలకు సేవలనందించింది. వారిలో 50%కు పైగా సంరక్షణ క్లిష్టతతో సంబంధంలేకుండా పూర్తిగా ఉచితంగా సేవలు అందించబడ్డాయి. అంతర్జాతీయంగా ప్రఖ్యాతిగాంచిన నేత్ర వైద్యులు మరియు అనేక ప్రతిష్ఠాత్మక పురస్కారాలు, గుర్తింపులు మరియు నాయకత్వ హోదాలను పొందిన డా రావు మాట్లాడుతూ “ఎల్విపిఇఐని కొత్త శిఖరాలకు తీసుకువెళతారనే సురక్షితమైన భావనతో నా వారసులు ప్రశాంత్ గర్గ్ కు బాధ్యతను అప్పగిస్తున్నాను. ఎల్విపిఇఐ తన సేవలను విస్తరించడాన్ని కొనసాగిస్తుందని, చేరుకోనివారిని చేరుకుంటుందని, మరెన్నో జీవితాలను ప్రభావితం చేస్తుందని మరియు నిస్పక్షపాతమైన నేత్ర సంరక్షణ అందరికీ అందించాలనే తన ఉద్దేశ్యానికి దృఢంగా నిలుస్తుందని నేను విశ్వసిస్తున్నాను. అతనికి మరియు బృందానికి నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను” అన్నారు. ఎల్విపిఇఐకి డా గుళ్ళపల్లి ఎన్ రావు మార్గనిర్దేశకులుగా కొనసాగుతారు.

డా ప్రశాంత్ గర్గ్ కార్నియా సంబంధిత ఇన్ఫెక్షన్లు, సూక్ష్మజీవుల నిరోధకత మరియు నేత్రనిధులలో అంతర్జాతీయ ఖ్యాతిగల నాయకులు. అనేక ప్రతిష్ఠాత్మక జాతీయ మరియు అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్న ఆయన అనేక అంతర్జాతీయ సంస్థల, సంఘాల మరియు వైజ్ఞానిక జర్నల్స్ బోర్డులలో ఉన్నారు. ఎల్విపిఇఐతో ఆయన సాంగత్యం 1996లో కార్నియా ఫెల్లోగా సంస్థలో ఆయన చేరిననాడు ప్రారంభమైనది. ఈ 25 సంవత్సరాలలో సంస్థలో ఆయన హైదరాబాదులోని అత్యుత్తమ కేంద్రం కల్లం అంజిరెడ్డి ప్రాంగణం డైరెక్టర్; విజయవాడలోని కోడె వెంకటాద్రి చౌదరి ప్రాంగణం డైరెక్టర్; నేత్రనిధి వ్యవస్థ అధిపతి; మరియు విద్యా విభాగ అధిపతితో సహా అనేక నాయకత్వ పదవులను నిర్వహించారు. ఆయన కార్నియాలో డా పాల్ డుబోర్డ్ చైర్ పదవిని కూడా నిర్వహిస్తున్నారు.

ఒక దృఢమైన ప్రచురణల రికార్డ్ మరియు అనేక పరిశోధనా గ్రాంటులుగల డా గర్గ్ ఒక సంపూర్ణ వైద్యులు-పరిశోధకులు. ఆయనకు పీర్-రివ్యూడ్ జర్నల్సులో 190కు పైగా వైజ్ఞానిక ప్రచురణలన్నాయి మరియు అనేక

పుస్తకాల అధ్యాయాలను ఆయన రచించారు. ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సమావేశాలలో ఆయన ఆహ్వానిత ఫాకల్టీగా ఉన్నారు, అనేక నిర్దేశిత ఉపన్యాసాలను వెలువరించారు.

"ఈ కొత్త పదవిని చేపట్టడం నేను విశేషంగా మరియు ఉత్తేజితంగా భావిస్తున్నాను. మా రోగులు, దాతలు మరియు మద్దతుదార్లనుంచి మేము అందుకుంటున్న అమూల్యమైన మద్దతు, మరియు మాకున్న సమర్ధవంతమైన బృందంతో ఎల్విపిఇఐ తన సేవలను విస్తరించడం కొనసాగిస్తుందని, సమాజాలకు దగ్గరగా నేత్ర సంరక్షణను తీసుకురాగలదని, పునరావాసం అందించగలదని, నూతన సాంకేతిక ఆవిష్కరణలను అనువర్తించగలుగుతుందని, దృష్టి హాని కలిగించే కంటి స్థితులలో పరిశోధనను కొనసాగిస్తుందని, నాణ్యమైన శిక్షణనిస్తుందని, జాతీయంగా మరియు ప్రపంచవ్యాప్తంగా భాగస్వాములతో సహకరిస్తూ నివారించగల అంధత్వ నిర్మూలన దిశలో కృషి చేస్తుందని నేను విశ్వసిస్తున్నాను," అన్నారు డా ప్రశాంత్ గర్గ్, ఎగ్జిక్యూటివ్ అధ్యక్షులు, ఎల్ వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ.

**ఎల్ వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ:** 1987 సంవత్సరంలో స్థాపించబడి, అంధత్వ నివారణకై ప్రపంచ ఆరోగ్య సంస్థ సహకార కేంద్రమయిన ఎల్ వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ (ఎల్విపిఇఐ) ఒక సమగ్ర నేత్ర ఆరోగ్య సౌకర్యం. తన కార్యనిర్వహణకై ఎల్విపిఇఐలో పది క్రియాశీల విభాగాలున్నాయి – వైద్య సేవలు; విద్య; పరిశోధన; దృష్టి పునరావాసం; గ్రామీణ మరియు సామాజిక నేత్ర ఆరోగ్యం; నేత్రనిధి; అనుకూలవాదన మరియు విధాన ప్రణాళిక; సామర్థ్య నిర్మాణం; ఆవిష్కరణ మరియు ఉత్పాదన అభివృద్ధి. ఎల్విపిఇఐ నేత్ర సంరక్షణా వ్యవస్థలో భారతదేశంలోని తెలంగాణా, ఆంధ్రప్రదేశ్, ఒడిషా మరియు కర్ణాటక రాష్ట్రాలలో విస్తరించిన 236 కేంద్రాలున్నాయి. సమాజంలోని అన్ని వర్గాలకీ సమానమైన మరియు నాణ్యమైన నేత్ర సంరక్షణ అందజేయడం సంస్థ లక్ష్యం. గ్రామాలనుంచి నగరంవరకూ సమాజంలోని అన్ని వర్గాలనూ ఆవరిస్తున్న ఎల్విపిఇఐ ఐదు-శ్రేణుల 'నేత్ర ఆరోగ్య పిరమిడ్' నమూనా ఉన్నతమైన నాణ్యతగల మరియు సమగ్రమైన నివారణ, చికిత్స మరియు పునరావాసంతో కూడిన నేత్ర సంరక్షణ అందరికీ అందిస్తున్నది. సంస్థ ఇప్పటివరకూ 3 కోట్ల 21 లక్షలకు పైగా ప్రజలకు సేవచేసింది. అందులో క్లిష్టతతో సంబంధంలేకుండా అవసరమైన సంరక్షణ 50% పూర్తిగా ఉచితం.